క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే మాదిగలకు సముచిత స్థానం



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాపాక, ఎంఆర్‌పీఎస్ నాయకులు

మలికిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో మాదిగలకు సముచిత స్థానం లభించిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బొమ్మి ఇస్రాయేల్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంపై విశ్వేశ్వరాయపురంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యాన సీఎం జగన్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు అవకాశం

మామిడికుదురు/రావులపాలెం: పదో తరగతిలో ఉత్తీర్ణులై, ఇంటర్మీడియెట్‌లో చేరని వారితో పాటు, మధ్యలో మానేసిన వారు ఓపెన్ ఇంటర్‌లో చేరేందుకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నారు. మామిడికుదురు, రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కేఎస్‌వీఎస్ఎస్ ఏసుబాబు, పి.గోపాలకృష్ణ వేర్వేరు ప్రకటనల్లో ఈ విషయం తెలిపారు. ఓపెన్ ఇంటర్‌లో చేరాలనుకునే వారు తమ ఆధార్ కార్డ్ జిరాక్స్, రిజిస్ట్రేషన్ కోసం 10వ తరగతి ఒరిజినల్ మార్కుల జాబితాతో పాటు మొబైల్ ఫోన్‌తో ఈ నెల 26లోగా (రావులపాలెం), ఈ నెల 27లోగా మామిడికుదురు కళాశాలల్లో సంప్రదించి, అడ్మిషన్లు పొందాలని సూచించారు.

జగనన్న భూరక్ష పథకాన్ని వేగవంతం చేయాలి



పెనికేరులో సరిహద్దు రాళ్ల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి

ఆలమూరు: జగనన్న భూరక్ష పథకాన్ని వేగవంతం చేయాలని, రైతుల భూమిలో గుర్తించిన హద్దుల్లో రాళ్లు ఏర్పాటు చేయాలని కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి ఆదేశించారు. మండలంలో ఇప్పటికే భూసర్వే పూర్తయిన మడికి, బడుగువానిలంక, చొప్పెల్ల, గుమ్మిలేరు, చింతలూరు, పెనికేరు గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే భూసర్వే పూర్తి కావడంతో సరిహద్దు రాళ్లు పూర్తి స్థాయిలో సరఫరా చేశామని స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిపారు. పెనికేరు, చింతలూరు గ్రామాల్లో కూలీలతో స్వయంగా మాట్లాడి సరిహద్దు రాళ్ల ఏర్పాటును ప్రారంభించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పెనికేరు అంగన్‌వాడీ కేంద్రాన్ని కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి, ఆహార నిల్వలను, ఆహార పదార్థాలపై గడువు తేదీలను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఈ విషయం తెలిపారు.

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం రావులపాలెం, ఈతకోట, ఊబలంక, గోపాలపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు.

అయినవిల్లి: మండలంలో రహదారి విస్తరణ, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్తరమూడి, పాలెపులంక, అయినవిల్లిలంక గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ.. చింతనలంక, మడుపల్లి, వెలవలపల్లి, నేదునూరు, నల్లచెరువు గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ నిలిపివేస్తున్నట్టు రవికుమార్ తెలిపారు

'జగనన్నే మా భవిష్యత్'పై నేడు 4 గ్రామాల్లో అవగాహన

అయినవిల్లి: మార్చి 18 నుంచి చేపట్టే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై నాలుగు గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం విలేకరులకు తెలిపారు. శంకరాయగూడెం, క్రాప గ్రామాల్లో ఉదయం 10 గంటలకు, కె.జగన్నాథపురంలో 2 గంటలకు, పోతుకుర్రులో సాయంత్రం 4 గంటలకు ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు హాజరు కావాలని ఎమ్మెల్యే సూచించారు.

మూలేశ్వరస్వామికి సింహాసనం

ఆలమూరు: మూలస్థాన అగ్రహారంలో పార్వతీ సమేత మూలేశ్వరస్వామి వారికి చెక్కతో తయారు చేసిన సింహాసనాన్ని పేరూరి పేరూరి మహేంద్రనాథ్, రమ్య, పేరూరి రాజా, అమ్మాజీ దంపతులు (రాజమహేంద్రవరం) గురువారం సమర్పించారు. వేద పండితుడు కాళ్లకూరి సత్యనారాయణమూర్తి మంత్రోచ్చారణ నడుమ సింహాసనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఈఓ ఎంఎల్ఆర్ కృష్ణకు అందజేశారు.

'సెల్'కు సెలవు చెప్పండి

- విద్యార్థులపై దుష్ప్రభావం
- సామాజిక మాధ్యమాలతో సమయం వృథా
- పరీక్షల వేళ దూరంగా ఉండాలంటున్న నిపుణులు
- నిద్ర లేమి, కంటి జబ్బులు, మానసిక రుగ్మతలు తప్పవని హెచ్చరిక



సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన యువత

కొత్తపేట: సెల్‌ఫోన్.. సరిగ్గా వాడుకుంటే మేలే కానీ.. దీనికి బానిస అయిపోతే మాత్రం ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదయం లేస్తే రాత్రి నిద్ర పోయేంత వరకూ సెల్‌ఫోన్‌తో ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సాప్, టిక్‌ట్యాక్.. ఇలా సామాజిక మాధ్యమాల్లో ఎంతో మంది గంటల తరబడి కాలం గడిపేస్తున్నారు. ఇది చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరి పైనా దుష్ప్రభావం చూపుతోంది. ఈ ట్రెండ్ విద్యార్థులకు ఎంతో నష్టం తెస్తుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. సామాజిక మాధ్యమం రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. ఆశయం దిశగా సాగితే విజ్ఞానాన్ని పంచుతుంది. ఏమాత్రం గురి తప్పినా పెడతోవ పట్టిస్తుంది. జీవితాన్ని తలకిందులు చేస్తుంది. వచ్చే నెల 15 నుంచి ఇంటర్మీడియెట్, ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్లతో సామాజిక మాధ్యమాల్లో కాలం గడిపేస్తే చదువు, అనుకున్న లక్ష్యం పక్కదారి పట్టి.. ఉజ్వల భవితకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంటుందని ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నారు.

పరిమితి దాటితే ప్రమాదమే..

ప్రస్తుత రోజుల్లో సామాజిక మాధ్యమాల వినియోగం తప్పనిసరి అవుతున్నప్పటికీ.. దీని వినియోగానికి ఓ పరిమితి పెట్టుకోవాలి. ఆ పరిధి దాటి వినియోగిస్తే ఇబ్బందులు తప్పవని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా కంటి సమస్యలు, మానసిక రుగ్మతలు తప్పవని చెబుతున్నారు. టిక్‌ట్యాక్‌తో అనేక ప్రయోగాలు చేయడం, కామెంట్లు, లైక్‌లు వస్తే ఆనందపడటం, వ్యతిరేకంగా కామెంట్లు చేస్తే బాధకు లోనవడం వంటి లక్షణాలు కొంతమందిలో ఉంటున్నాయి. పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో కూడా కొంతమంది విద్యార్థులు సెల్‌ఫోన్ వ్యసనాన్ని వదులుకోలేకపోతున్నారు. ప్రతి పది నిమిషాలకోసారి ఫోన్ వైపు చేయి వెళ్తోందా? ఫేస్‌బుక్, టిక్‌ట్యాక్, వాట్సాప్ చూడాలనిపిస్తోందా? అనే విషయాలను ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. పరిస్థితి చేయి దాటినట్టు భావిస్తే పది రోజుల పాటు వాటికి దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలి. ఇలా ఉండగలిగితే నియంత్రణలో ఉన్నట్టే. ఉండలేకపోతున్నారంటే వాటికి బానిస అయినట్టేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి



ఫేస్‌బుక్, టిక్‌ట్యాక్ అంటూ ప్రతి విద్యార్థీ వాటికి అలవాటు పడి చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. సమాచారం, విజ్ఞానం, వినోదం కోసం కొంత సమయం మాత్రమే వినియోగించాలి. పరీక్షలు ముగిసే వరకూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటే మంచి ఫలితాలు సాధిస్తారు. తరువాత కూడా దుష్ఫలితాలను దృష్టిలో పెట్టుకుని అవసరం మేరకు మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలి.

– మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

చదువు పైనే దృష్టి పెట్టాలి



ప్రస్తుతం ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకూ చదువుతున్న విద్యార్థులు, యువత ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా యాప్‌లకు అలవాటు పడ్డారు. ఫలితంగా చదువులు పక్కదారి పడుతున్నాయి. సామాజిక మాధ్యమాలతో విలువైన సమయాన్ని వృథా చేయకూడదు. పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో వాటికి దూరంగా ఉండాలి. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి.

– కేఎస్‌వీ కృష్ణారెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఈతకోట, రావులపాలెం మండలం

చూపుపై ప్రభావం



సెల్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడిపితే కంటి చూపుపై ప్రభావం పడుతుంది. పిల్లలపై మరింత త్వరగా పడుతుంది. కళ్లు నీరు కారడం.. తద్వారా కార్నియా పొడిబారడం, తలనొప్పి, చూపు మందగించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే బ్రెయిన్ ట్యూమర్లు కూడా ఏర్పడుతున్నాయి. అందువలన సెల్‌ఫోన్ అతి వినియోగం మంచిది కాదు. అవసరం మేరకే వినియోగించాలి.

– డి.అక్ష, ఆప్తాలమిక్ అధికారి, ప్రభుత్వ ఆస్పత్రి, కొత్తపేట

ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ ధర్మపోరాటం

- అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన
- గ్రామ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో రాజోలు ఎమ్మెల్యే రాపాక



గోగన్నమఠం సభలో కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక

మామిడికుదురు: ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ ధర్మపోరాటం చేస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్ అధ్యక్షతన గోగన్నమఠంలో గురువారం జరిగిన గ్రామ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కొంత మంది పెత్తందార్లకే సంక్షేమం పరిమితం కాలేదని, అర్హులందరికీ అందించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని అన్నారు. వీటన్నింటినీ గమనించి రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల్ని ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే రాపాక పిలుపునిచ్చారు. సమావేశంలోఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, పీఏసీఎస్ చైర్మన్లు సాగి పీఆర్‌వీఎస్ఎస్ నరసింహవర్మ, కటకంశెట్టి ఆదిత్య, వైఎస్ ఎంపీపీ భూపతిరాజు లక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వాస్తవాలకు దగ్గరగా ఉంటేనే మీడియాపై విశ్వాసం

మలికిపురం: వాస్తవాలకు దగ్గరగా ఉంటేనే మీడియాపై ప్రజల్లో విశ్వాసం ఉంటుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. కత్తిమండలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకుడు పట్టాభిని కొట్టారంటూ ఈనాడులో తప్పుడు కథనం రావడం విచారకరమన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని, ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేసి చూపారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు గల సామాజిక దృక్పథానికి ఇటీవల ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు మరో ఉదాహరణని ఎమ్మెల్యే అన్నారు. ఏనాడూ రాజకీయ పదవులు దక్కని సామాజికవర్గాలను సైతం ఎమ్మెల్సీలుగా అధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఘనత జగన్‌దేనని చెప్పారు. దీంతో ప్రతిపక్షాలకు గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయిందని అన్నారు. గోదావరి జిల్లాల్లో మాదిగలకు ఏనాడూ ప్రాతినిధ్యం దక్కలేదని.. అటువంటిది ఆ వర్గం నుంచి బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీగా సీఎం జగన్ అవకాశం కల్పించారని చెప్పారు. విలేకర్ల సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, ఏఎంసీ ఉపాధ్యక్షులు సుంకర బాబ్జీ, సొసైటీ చైర్మన్ యెనుముల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తా..

గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షునిగా ఆదిత్య



ఎమ్మెల్యే రాపాకను కలిసిన ఆదిత్య కుమార్

మామిడికుదురు/మలికిపురం: వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తానని పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి విజయధర్మ ఆదిత్య కుమార్ అన్నారు. మామిడికుదురుకు చెందిన ఆయన ఈ పదవిలో నియమితులైన విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం మామిడికుదురు పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా ఆదిత్యకుమార్.. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును మలికిపురం మండలం కత్తిమండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఈ పదవిలో నియమించేందుకు సహకరించిన ఎమ్మెల్యే రాపాకకు, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని, పార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తానని ఈ సందర్భంగా ఆదిత్యకుమార్ స్పష్టం చేశారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షునిగా శ్రీధర్



శ్రీధర్

ఆత్రేయపురం: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షునిగా ర్యాలి గ్రామానికి చెందిన కప్పల శ్రీధర్ నియమితులయ్యారు. ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉన్న ఆయన సామాన్య కార్యకర్త నుంచి మండల బూత్ కమిటీ మేనేజర్‌గా.. ప్రస్తుతం రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నారు. పార్టీ అప్పగించిన ప్రతి పనినీ చిత్తశుద్ధితో పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రతిపాదన మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి శ్రీధర్‌ను ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీధర్‌ను రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి , మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ సభ్యులు బోణం సాయిబాబు, కుడుపూడి శ్రీనివాస్, ఎంపీపీలు కుండ అన్నపూర్ణ, మార్గని గంగాధరం, కర్రి వీర్రెడ్డి తదితరులు అభినందించారు.

సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- పలు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం



ఆదుర్రులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మాకనపాలెం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాలు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన గురువారం నిర్వహించారు. వీటిల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేపట్టామని వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వచ్చే నెల 18 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ తరఫున ప్రజలకు పరిచయం చేసుకుని, వారి అనుమతితో ప్రతి ఇంటికీ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లు అతికించాలని అన్నారు. సమావేశాల్లో పార్టీ నేతలు చిట్టూరి రామకృష్ణ, జక్కంపూడి వాసు, ముత్యాల నరసింహారావు, కటకంశెట్టి ఆదిత్యకుమార్, నెల్లి దుర్గాప్రసాద్, యూవీవీ సత్యనారాయణ, గెద్దం వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, గెద్దం మహాలక్ష్మమ్మ, కుసుమ శ్రీధర్, అడబాల చక్రపాణి, మద్దాల బాబూరావు, యాండ్ర వీరబాబు, కాండ్రేగుల బాబి, భూపతి దామోదరరావు పాల్గొన్నారు.

పక్కా డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు

అంబాజీపేట: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు డ్రైనేజీల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట హడ్కో కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ నెల 7న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో కాలనీ వాసులు మురుగు నీరు పారేందుకు డ్రైనేజీలు నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే చిట్టిబాబు ఆదేశాల మేరకు డ్రైనేజీల్లో పూడికతీత, కొత్త వాటి నిర్మాణాలను అధికారులు చేపట్టారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా శ్రద్ధ వహించి, పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలకుమారి కుటుంబ సభ్యులకు పరామర్శ



నిర్మలకుమారి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఆలమూరు: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు కొల్లి నిర్మలకుమారి కుటుంబ సభ్యులను రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం పరామర్శించారు. ఆలమూరులోని ఆమె నివాసానికి వెళ్లిన ఆయన.. నిర్మలకుమారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుమారుడిని, కుమార్తెను పరామర్శించి, సానుభూతి తెలిపారు. సర్పంచ్ నేలపూడి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు సిబ్బంది పని చేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ దుర్గారావుదొర
- అవిడి పీహెచ్‌సీ ఆకస్మిక సందర్శన



పీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ దొర

కొత్తపేట: సంపూర్ణ ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, దీనికి అనుగుణంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ బి.దుర్గారావుదొర ఆదేశించారు. అవిడి పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, సేవలను, రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. పేదలకు వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నడవలేని స్థితిలో ఆస్పత్రులకు చేరుకోలేని వారి గడప వద్దకే నేరుగా వెళ్లి వైద్య సేవలందించేందుకే ఫ్యామిలీ ఫిజీషియన్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సుఖప్రసవం జరిగేలా గర్భం దాల్చినప్పటి నుంచీ అవగాహన కల్పించాలని అన్నారు. పుట్టిన పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు, టీబీ, లెప్రసీ వంటి వైద్య సేవలపై సమీక్షించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తప్పవని డాక్టర్ దుర్గారావుదొర హెచ్చరించారు. సమావేశంలో డీఐఓ టీకే శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరా భారతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన వ్యాన్



ప్రమాదంలో ధ్వంసమైన వ్యాన్, విద్యుత్ స్తంభాలు

మామిడికుదురు: అతి వేగంగా వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి, గురువారం ఉదయం రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి, కొబ్బరి చెట్టును పెకలించుకుంటూ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ఎటువంటి అపాయమూ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అమలాపురం వైపు నుంచి తాటిపాక వైపు 216వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తున్న వ్యాన్ ఎడమ వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని అతి వేగంగా ఢీకొట్టింది. ఆ తాకిడికి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. అనంతరం ఆ వ్యాన్ పక్కనే ఉన్న రేకుల షెడ్డును ఢీకొట్టింది. ఆ వేగానికి ఆ షెడ్డుకు ఆనుకుని ఉన్న కొబ్బరి చెట్టు మధ్యలోకి విరిగిపోయి వ్యాన్‌పై కూలిపోయింది. అక్కడితో ఆగని ఆ వ్యాన్ పక్కనే ఉన్న మరో విద్యుత్ స్తంభాన్ని కూడా ఢీకొని, తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని ఇసుకలో కూరుకుపోయింది. ఈ ప్రమాదంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఆ సమయంలో రోడ్డుపై ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వ్యాన్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. క్లీనర్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. నగరం పోలీస్ స్టేషన్ ఎదురుగానే ఈ సంఘటన జరిగింది. పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్



ప్రమాద సమయంలో సహాయక చర్యలపై మాక్ డ్రిల్

కొత్తపేట/రావులపాలెం: అగ్నిప్రమాదాల నివారణపై గంటి సమీపంలోని ఈతకోట నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ (ఎన్ఏసీఎల్) పరిశ్రమలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ సూచనల మేరకు వివిధ ప్రమాదాల సమయంలో చేపట్టే చర్యలపై పరిశ్రమ సిబ్బందికి భద్రతా అధికారులు అవగాహన కల్పించారు. ఎల్‌పీజీ లీకేజీ సమయంలో చేపట్టే చర్యలపై యూనిట్–1లో మాక్ డ్రిల్, సాల్వెంట్ అగ్నిప్రమాద సమయంలో చేపట్టే చర్యలపై యూనిట్–2లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్, సీనియర్ జీఎం బి.శ్రీనివాసరావు, హెచ్‌పీడీ హెడ్ పి.సుభాకర్, ప్రొడక్షన్ హెడ్ వై.ప్రవీణ్‌కుమార్, మెటీరియల్ హెడ్ ఎస్.శ్రీనివాసరాజు, సేఫ్టీ అధికారి పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

స్కూల్ వ్యాన్‌కు మంటలు

మలికిపురం: గుడిమెళ్లంక మూలపోడులోని భాష్యం స్కూల్ వ్యాన్‌కు గురువారం మంటలు వ్యాపించిన ఘటనలో విద్యార్థులకు పెద్ద ప్రమాదం త్రుటిలో తప్పింది. ఉదయమే విద్యార్థులతో టాటా ఏస్ వ్యాన్ వెళ్తోంది. మలికిపురం భూపతివారిపేట వద్దకు చేరేసరికి ఆ వ్యాన్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అప్రమత్తం చేయడంతో అందులోని విద్యార్థులను వెంటనే కిందకు దింపి, మరో వాహనంలో పాఠశాలకు తీసుకు వెళ్లారు. మరమ్మతులకు ఇచ్చిన వాహనాన్ని హడావుడిగా తీసుకురావడంతో డీజిల్ ట్యాంకు నుంచి ఆయిల్ లీకై మంటలు వ్యాపించినట్టు గుర్తించారు.

ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థికి అభినందనలు

సఖినేటిపల్లి: మలికిపురం మండలం మట్టపర్రుకు చెందిన గెద్దం దిలీప్ కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. అతడిని మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో చైర్మన్ ఓగూరి టాండన్‌రాజు, శాలువా కప్పి గురువారం అభినందించారు.

డ్రోన్‌తో స్ప్రేయింగ్ లాభదాయకం

అంబాజీపేట: డ్రోన్‌తో పురుగు మందులు స్ప్రే చేయడం ఎంతో లాభదాయకమని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్ కుమార్ అన్నారు. ఇరుసుమండలో వీఏఏ ఎస్.కిరణ్‌దుర్గ అధ్యక్షతన గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. కిసాన్ డ్రోన్ పథకం ద్వారా మండలంలో మూడు యూనిట్లను డ్రోన్‌తో ఎకరానికి 10 లీటర్ల మందు ద్రావణాన్ని 10 నిమిషాల్లో పిచికారీ చేయవచ్చన్నారు.

పొక్లెయిన్ ఇవ్వని ఇద్దరిపై కేసు

అంబాజీపేట: అద్దెకు తీసుకున్న పొక్లెయిన్‌ను తిరిగి ఇవ్వని ఇద్దరిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. అంబాజీపేట హెడ్ కానిస్టేబుల్ కె.హరిప్రసాద్ కథనం ప్రకారం.. మాచవరం మెట్ల కాలనీకి చెందిన ఆకుల సురేఖకు పొక్లెయిన్ ఉంది. దీనిని గత ఏడాది అక్టోబరులో గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలేనికి చెందిన ముషిణి రాంబాబు మధ్యవర్తిగా ఉండి అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన నిమ్మకాయల శేఖర్, బొంతు రమేష్‌లకు పని నిమిత్తం ఇచ్చారు. వారు ఎప్పటికీ పొక్లెయిన్ తిరిగి ఇవ్వకపోగా.. అడిగిన సురేఖ భర్త శ్రీరామ్మూర్తిపై శేఖర్, రమేష్ దౌర్జన్యం చేశారు.

సోము వీర్రాజుపై విమర్శలు తగవు

కొత్తపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ విమర్శలు చేయడం తగదని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంపతి కనకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ మారే ఉద్దేశం ఉన్నప్పుడు రాజీనామా చేసి వెళ్లిపోవాలే తప్ప వేరే పార్టీ నుంచి వచ్చి, ఉన్నత పదవులు పొంది, పార్టీ వారిని విమర్శించడం తగదని అన్నారు.

కిసాన్ నిధి ద్వారా రూ.6 వేల సహాయం

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం కిసాన్ నిధి నుంచి మూడు విడతలుగా రైతుల ఖాతాలకు రూ.6 వేల వంతున జమ చేస్తోందని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ అన్నారు. అప్పనపల్లిలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో కేంద్ర ప్రభుత్వ సహాయం అందుకున్న ఐదుగురు రైతులను పార్టీ తరఫున శుక్రవారం సన్మానిస్తామన్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు పుంతలో ముసలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



పుంతలో ముసలమ్మ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆలమూరు: పినపళ్లలో గ్రామస్తుల సహకారంతో శ్రీ పుంతలో ముసలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన భక్తబృంద సభ్యులు మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారి విగ్రహానికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి మహిళలు నైవేద్యాలు సమర్పించి, నూతన వస్త్రాలు అందజేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నూతన ఆలయం వద్ద ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి.

నూకాంబికా అమ్మవారికి గ్రామోత్సవం

మండలంలోని చింతలూరులో వేంచేసియున్న శ్రీ నూకాంబికా అమ్మవారు బుట్ట గరగ రూపంలో పినపళ్ల గ్రామస్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవంలో అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు సమర్పించారు.